

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

విశాలాంధ్ర - గొలుగొండ: విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లి బంగారు జీవితాలను నాశనం చేసుకోవద్దని కృష్ణదేవి పేట ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ శ్రీహరి తెలిపారు. సోమవారం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు మత్తుపదార్థాలపై అవగాహన నిర్వహించి అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీహరి మాట్లాడుతూ విద్యార్థి దశలో యువత చెడు మార్గాల వైపు ఆకర్షితులవుతున్నారని విద్యార్థులు చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కుటుంబాలకు, ఊరికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం నగరంలో ఉన్న బీసీ మహిళ వసతి గృహంలో వద్ద ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు రాజాన దొరబాబు ఏఐఎస్ఎఫ్ జెండాను ఎగురవేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దొరబాబు మాట్లాడుతూ దేశ స్వతంత్రమే ధ్యేయంగా దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘంగా 1936 ఆగస్టు 12వ తేదీన ఉత్తర ప్రదేశ్ లక్నో నగరంలో బెనారస్ విశ్వవిద్యాలయంలో ఏర్పడి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య జన్మ హక్కు అంటూ నినదించి విద్యార్థులను ఐక్యం చేస్తూ ఎన్నో అలుపెరగని ఉద్యమాలు నిర్వహించి 88 సంవత్సరాలు పూర్తి చేసుకుని 89వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న ఎంతో గొప్ప చరిత్ర ఉన్నటువంటి ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం చాలా గర్వంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపైన పోరాటాలు నిర్వహించాలని అన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపైన ఏఐఎస్ఎఫ్ భవిష్యత్ కార్యక్రమానికి శ్రీకారం చుడుతుందని రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాల్లో ఉన్నటువంటి సమస్యలు పరిష్కారానికై అనకాపల్లి జిల్లా కేంద్రంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసే విధంగా ఏఐఎస్ఎఫ్ పోరాటాలు నిర్వహిస్తుందని, అదేవిధంగా విద్య ప్రైవేటీకరణకు, కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్య వ్యతిరేక విధానాలపైన దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సింహాద్రి, రంజిత, కృష్ణవేణి, వెంకట్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పాయకరావుపేట బీసీ మహిళ వసతి గృహం వద్ద ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు జగ్గారావు ఏఐఎస్ఎఫ్ జెండాను ఎగర

వేశారు. జగ్గారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపైన పోరాటాలు నిర్వహించాలని సూచించారు. ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపైన ఏఐఎస్ఎఫ్ భవిష్యత్ కార్యక్రమానికి శ్రీకారం చుడుతుందని రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాల్లో ఉన్నటువంటి సమస్యలు పరిష్కారానికై, పాయకరావుపేట కేంద్రంగా ప్రభుత్వ కళాశాల వసతి గృహం సొంత భవనం ఏర్పాటు చేసే విధంగా పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సీత లత, ప్రసాద్, ఏసు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి: అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీసీ కాలేజీ బాలుర వసతి గృహం వద్ద ఏఐఎస్ఎఫ్ డివిజన్ నాయకులు సతీష్ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమాలలో ఉద్భవించి, పోరాటాలలో రాటుదేలి సామ్యవాద సమాజ స్థాపన కోసం అవిరళ త్యాగాలతో ఉద్యమాన్ని నిర్మిస్తున్న ఏకైక విద్యార్థి సంఘం అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ అని అన్నారు. మార్క్సిజం లెనినిజం తన ఊపిరిగా, శాస్త్రీయ సోషలిజం తన గమ్యంగా, సెక్యులరిజాన్ని ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించుకోవడం తన కర్తవ్యమని సమరశీల విద్యార్థి ఉద్యమాల నిర్మాణంలో నిమగ్నమైన అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ 88 సంవత్సరాలు పూర్తిచేసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఏఐఎస్ఎఫ్ ఎలమంచిలి డివిజన్ నూకరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐ ఎస్ఎఫ్ డివిజన్ నాయకులు మధు, ప్రసాద్, శివ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

విశాలాంధ్ర - మాకవరపాలెం: 48 ఏళ్ల తర్వాత మాకవరపాలెం పూర్వ విద్యార్థులు సోమవారం ఒకచోట కలుసుకున్నారు. మాకవరపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1976 - 1977లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఉదయం నుంచి ఆనందంగా గడిపారు. 48 ఏళ్ల క్రితం చదువుకున్న సమయంలో జరిగిన తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమం స్థానిక శ్రీ కన్య థియేటర్‌లో 30 మంది పూర్వ విద్యార్థులతో జరిగింది.

వ్యవసాయ మోటార్లకు విద్యుత్ పునరుద్ధరణ

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: దిబ్బిడి వంక చెరువు క్రింద పొలాల్లో గల వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిందే. చెట్లు తొలగింపు సమయంలో విద్యుత్ వైర్లు తెగిపోవడంతో గత వారం రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎట్టకేలకు స్పందించిన విద్యుత్ శాఖ సిబ్బంది సోమవారం తెగిపోయిన విద్యుత్ వైర్లను సరి చేశారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - పరవాడ: రాంకీ ఫౌండేషన్ 18వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం రాంకీ పరిపాలన కార్యాలయ ప్రాంగణంలో విశాఖ ఫార్మాసిటీ సహకారంతో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని విశాఖ ఫార్మాసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా.పివి లాల్ కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా లాల్ కృష్ణ మాట్లాడుతూ దేశంలో అవసరమైన మేరకు రక్త నిధి కేంద్రం నందు రక్తం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెనుకబడిన జిల్లాలు ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో గర్భిణీల ప్రసవ సమయంలో రక్తం అందక చాలా మంది మహిళలు ఇబ్బంది పడుతున్నారని ఈ సమస్యను అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ ఏడాదికి కనీసం మూడు సార్లు రక్తదానం చేయాలని కోరారు. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నందుకు రాంకీ ఫౌండేషన్ వారిని ఈ సందర్భంగా అభినం దించారు. అనంతరం 150 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఛైర్మెన్ కె.శ్రీనివాసరావు, విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్ భక్షి, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ కె.శ్రీకాంత్, విశాఖ ఫార్మాసిటీ, రాంకీ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ విధానం రద్దు చేయాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ క్రిమిలేయర్ విధానంను రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ దేశంలో ఈ నెల 21న నిర్వహించే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని, పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా మనువాద పాలకులపైన ఒత్తిడి తేవడానికి ఉద్యమం ఉధృతం చేయాలని దళిత బహుజన పార్టీ రాష్ట్ర

అధ్యక్షురాలు దాసరి అన్నపూర్ణ పిలుపునిచ్చారు. పాయకరావుపేటలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ దళితుల భవిష్యత్తుకు పెను ప్రమాదం వర్గీకరణ ద్వారా రాబోతుందన్నారు. స్వతంత్ర రాజ్యాధికారంలోకి దళిత జాతులు రానీయకుండా శాశ్వతంగా శత్రువులుగా మార్చి వేయదానికి మనువాద దోపిడీ కుల పాలకులు చేసిన సామాజిక కుట్రలు వర్గీకరణ వాదం అన్నారు. దీని వలన దళిత జాతులందరికి నష్టం జరుగుతుందన్నారు. వర్గీకరణ అంతం - దళితుల పంతంగా తిరుగుబాటు చేయకపోతే బానిసత్వం తప్పదని అన్నపూర్ణ తెలిపారు. ఈ సమావేశంలో సుప్రీంకోర్ట్ న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్, పార్టీ జిల్లా అధ్యక్షులు దువ్వాడ దావీదు, మాలమహానాడు అనకాపల్లి జిల్లా శాఖ అధ్యక్షులు తట్టా శ్రీనివాసరావు, పాయకరావుపేట అసెంబ్లీ ఇంచార్జ్ బదుగు అచ్చరావు, టౌన్ శాఖ అధ్యక్షులు రావాడ జాన్ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ ఏఈగా హరిణి

విశాలాంధ్ర - పరవాడ: అసిస్టెంట్ ఇంజనీర్‌గా ఏ.హరిణి సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేసిన జీఎస్ రామారావును పంచాయితీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విశాఖ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై నియమించారు. జీఎస్ రామారావు రెండు నెలల్లో పదవీ విరమణ చేయనున్నారు. తొలుత ఆయన స్థానంలో సబ్బవరం అసిస్టెంట్ ఇంజనీర్ ఏ.అప్పారావును డిప్యూటేషన్‌పై నియమించారు. ఆయన హయాంలో అనధికారిక వ్యక్తులు ఇంజనీరింగ్ సెక్షన్ కార్యాలయంలో ప్రవేశించి విధులు నిర్వహించడంతో తీవ్ర దుమారం చెలరేగింది. ఇది కాస్త పత్రికలకు ఎక్కడముతో ఉన్నతాధికారులు ఆయన డిప్టేషన్ రద్దుచేసి కసింకోట అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న హరిణిని ఇక్కడ నియమించారు. పదవి బాధ్యతలు చేపట్టిన ఆమె సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించి పనులు త్వరితగతను పూర్తి చేయాలని ఆదేశించారు.

600 అడుగుల మువ్వన్నెల జెండాతో భారీ ర్యాలీ

విశాలాంధ్ర - కశింకోట: ఉమా హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రెండు రోజులు ముందుగా సోమవారం మండలంలోని, బయ్యవరం గ్రామం నుండి తేగాడ మోడల్ స్కూల్ వరకు ఉమా హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో 600 అడుగుల జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. బయ్యవరంలో ఈ ర్యాలీని కశింకోట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వినోద్ బాబు ప్రారంభించారు. మండల టీడీపీ నాయకులు తదితరులు మువ్వన్నెల పతాకాన్ని కొంత దూరం తీసుకువెళ్లారు. పార్టీల కతీతంగా అన్ని పార్టీల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు డి.ఉమా శంకర్ మాట్లాడుతూ కన్నడ కంఠీరవ రాజ్ కుమార్ కుమారుడు కన్నడ చలనచిత్ర సూపర్ స్టార్ దివంగత పునీత్ రాజ్ కుమార్ ఆశయాల ప్రేరణతో ఈ సంస్థ ప్రారంభించామన్నారు. స్వచ్ఛందంగా గ్రామంలో ఎవరైనా పేదవారు ఉంటే వారికి ఆర్థిక సహాయం, అనారోగ్యంతో బాధపడుతున్న పేదవారు వైద్యం కోసం ఇబ్బందులు పడితే వైద్యం చేయించే బాధ్యత ఉమా హెల్పింగ్ హాండ్స్ తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు కాయలు మురళీధర్, ఉగ్గిన రమణమూర్తి, దాసరి బాబు, ఎస్.కె బాబర్, కర్రి సత్యనారాయణ, గాడి నాగరాజు, బుదిరెడ్డి మోహన్, బలిజి ముసలి నాయుడు, శెట్టిపల్లి అప్పల నాయుడు, దాడినాగరాజు, ద్వారపూడి వరమేశ్వరరావు పాల్గొన్నారు.

40 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - మాకవరపాలెం: మాకవరపాలెం మండలం జి.కోడూరు రెవెన్యూ సర్వే నెంబరు 472,473, 474లలో ఉన్న సుమారు 40 మంది కుటుంబాలకు న్యాయం చేయాలని జి.కోడూరు టీడీపీ అధ్యక్షుడు మళ్ల జయబాబు, తహశీల్దార్ ప్రసాద్‌ను కోరారు. ఈ సందర్భంగా జయబాబు మాట్లాడుతూ జి.కోడూరు సర్వేనెంబర్ 562 ప్రభుత్వ భూమిలో వెలగా వెంకటరమణ అక్రమంగా పక్కా భవనం నిర్మిస్తున్నారని పెంటకోట వెంకటరమణ హైకోర్టులో ఫిర్యాదు చేశారని, దీంతో కోర్టు అక్రమ కట్టడం కూల్చివేయాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. వెలగా వెంకటరమణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలకు స్పందించి నేను కాకుండా మరో నలభై మంది ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు నిర్మించి నివాసం ఉంటున్నారని వాటిని కూడా తొలగించాలని హైకోర్టును ఆశ్రయించగా ప్రభుత్వ భూమిలో 40 మంది కట్టడాలు ఉన్నట్లయితే వాటిని కూడా కూల్చివేయాలంటూ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కానీ ఆ 40 మంది కుటుంబాలకు చెందినవారు వారి తాతలు కాలం నుండి పూరి గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని కాలక్రమేనా టీడీపీ, కాంగ్రెస్, వైసీపీ ప్రభుత్వాల హయాంలో ఇళ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడంతో వారు అక్కడి స్థిర నివాసులు ఏర్పరచుకున్నారని తెలిపారు. వీరంతా తెలుపు రంగు రేషన్ కార్డు కలిగి బీపీఎల్ పరిధిలోని వారని పేర్కొన్నారు. విచారణ చేసి ఆ 40 మందికి ఇళ్లపట్టాలు మంజూరు చేయవలసిందిగా సోమవారం ఆయన తహశీల్దార్‌కి మెమోరాండం ఇచ్చారు.

ఎస్సీ వర్గీకరణ వద్దంటూ నిరసన ర్యాలీ

విశాలాంధ్ర - వి.మాడుగుల: సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ మండల కేంద్రమైన మాడుగులలో సోమవారం మాలనాడు నాయకులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో డీటీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీలకు అన్యాయం జరుగుతుందని దీనిని వెంటనే వెనక్కు తీసుకోవాలన్నారు. ఐక్యంగా అన్నదమ్ముల్లా ఉన్న కులస్తులను విడదీసి అన్యాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు మరువాడ ఈశ్వరరావు, మాడుగుల సర్పంచ్ కళావతి, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు, ఎం.రాజా బాబు, టి.ఈశ్వరరావు, మానస బ్యాంకు తమ్ముల ఈశ్వరరావు, సాగర వరమేష్, ఎస్.శ్రీనివాసరావు, కార్లి భవాని, ఈశ్వరరావు, భీమేష్, శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారును కలిసిన జనసేన నాయకులు

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యనారాయమూర్తిని సోమవారం మండల జనసేన పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గర్రెడ్డి శివాజీ, దాసరి అచ్యుత రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాడుగుల మండలంలో ఉన్న సమస్యలను వివరించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎన్‌డిఏ కుటుంబ సభ్యులు అందరూ కలిసి కట్టుగా పనిచేసి అన్ని స్కూల్ కమిటీలు చైర్మన్ గెలిచేటట్టు పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ కార్యదర్శి పిల్లా నాయుడు, సీనియర్ జనసేన నాయకులు ఆర్లి అంజిబాబు, కొండపల్లి మాతాజీ, దామరౌత్ అశోక్ తదితరులు ఉన్నారు.

జనసేన సభ్యత్వ నమోదులో పాయకరావుపేట నియోజకవర్గం 15వ స్థానం

- పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గెడ్డం బుజ్జి

విశాలాంధ్ర - పాయకరావుపేట: జనసేన పార్టీ సభ్యత్వ నమోదులో పాయకరావుపేట నియోజకవర్గం 15వ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గెడ్డం బుజ్జి తెలిపారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ 100 పైగా సభ్యత్వాలు చేసిన జన సైనికులను శాలువా, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గెడ్డం బుజ్జి మాట్లాడుతూ జనసేన పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వ నమోదులో నియోజకవర్గంలో 14,500 సభ్యత్వాలు నమోదు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో గెడ్డం చైతన్య 800 సభ్యత్వాలు, నల్లల రత్నాజి 718 సభ్యత్వాలు నమోదు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గెడ్డం కన్నబాబు, గెడ్డం ఆకాష్, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు యగదాసు నానాజి, వెలగా సుధాకర్, వప్పల శివ, సింగంపల్లి శ్రీను, పట్టణ అధ్యక్షులు ఆచంట దొర, జిల్లా కార్యదర్శి పల్లి దుర్గారావు, జగ్గన్నదొర, నారపరెడ్డి పద్మావతి, గీసాల పద్మ, అరుణ, ప్రసాదుల గణేష్, ముత్తి కార్తీక్, శివలంక నాగమల్లి, కర్రి బాబురావు, తుమ్మల శ్యామ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర - నక్కపల్లి: గ్రామ స్థాయిలో భూములకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించాలనే ప్రాథమిక లక్ష్యంతో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా భావిస్తున్న నేపథ్యంలో ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 25 వరకు సదస్సులు నిర్వహించనున్నట్టు తహశీల్దార్ అంబేద్కర్ తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సంబంధిత శాఖలకు చెందిన అధికారుల బృందం ప్రతి రెవెన్యూ గ్రామాన్ని సందర్శించి, భూ ఆక్రమణలు సెక్షన్ 22ఏ తారుమారుతో సక్రమంగా ముందస్తు సమాచారంతో ప్రభావితమైన వాటి గురించి నిర్దిష్ట సూచనతో భూమి సంబంధిత సమస్యలు ఉన్న వ్యక్తులందరి నుండి వివరాలు సేకరించడం జరుగుతుందన్నారు. ముందుగా గ్రామంలో పర్యటించి పూర్తిస్థాయి వివరాలు తెలుసుకున్న అనంతరం గ్రామంలో సదస్సు నిర్వహణ ఉంటుందని, ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీ నాయకులు ఎవరు పాల్గొన కూడదని వినతి పత్రాలు మాత్రమే స్వీకరించడం జరుగుతుందన్నారు. స్వీకరించిన పత్రం ఆన్లైన్ చేయడం జరుగుతుందని తహశీల్దార్ చెప్పారు. ఒక్కొక్క గ్రామానికి ఒక్కొక్క ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. 16న ఎస్.నరసాపురం, 17న సీహెచ్‌బి అగ్రహారం, 19 రమణయ్యపేట, 20న ముకుంద రాజుపేట, 21న బుచ్చిరాజుపేట, 22న న్యాయం పూడి, 23న దోసెల పాడు, 24న చిన్న రామభద్రపురం, 27న గుల్లిపాడు, 28న జి.జగన్నాథపురం, 29న కాగిత, 30న పెద్ద బోదిగలం, సెప్టెంబర్ 2న ఉద్దండపురం, 3న దొంకాడ, 4న రాజయ్యపేట, ఐదున నక్కపల్లి, 6న చందనాడ, 9న వేంపాడు, 10న దేవవరం, 11న సిహెచ్‌ఎల్ పురం, 12న గునుపూడి, 13న ఉపమాక, 17 గుడిచర్ల, 18 పెద్ద తీనార్ల, 19 డిఎల్ పురం, 20 చీడిక, 21 పెద్ద బోధిగలం, 23 నెల్లిపూడి, 24 చిన్న దొడ్డుగల్లు, 25 రేబాకతో ఈ సభలు ముగిస్తాయని, రెవెన్యూ గ్రామాల ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

సీలింగ్ భూముల రైతుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - గొలుగొండ: 30 ఏళ్లుగా తమ సాగులో ఉన్న భూమిని ల్యాండ్ టైటిల్ యాక్ట్ ద్వారా కాజేయాలని కొంతమంది పెద్దలు చూశారని పాత కృష్ణదేవి పేటకు చెందిన సీలింగ్ భూముల రైతులు మంగళగిరిలో జనసేన పార్టీ కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబుకు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు వినతి పత్రాలు అందించారు. గొలుగొండ మండలం కృష్ణదేవి పేట రెవెన్యూ పరిధిలో గల16/ఇ,1-38/2 సర్వే నెంబర్లు గల సీలింగ్ భూములను 30 సంవత్సరాల క్రితం 30 మంది నిరుపేద రైతులకు లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేసి పట్టాలు అందించడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ నర్సీపట్నం శాసనసభ్యులు రాష్ట్ర శాసనసభ అధిపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళ్లి సీలింగ్ భూముల రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాత కృష్ణదేవి పేట ఉపసర్పంచ్ దుంపలపూడి సహదేవుడు, అనకాపల్లి జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు ఊడి చక్రవర్తి, జిల్లా కార్యదర్శి హరినాథ్, అల్లాడి సంతోష్, ఈర్ని చిన్ని, 30 మంది సీలింగ్ రైతులు పాల్గొన్నారు.

లయిన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన సదస్సు

విశాలాంధ్ర - చోడవరం: అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ చోడవరం శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యువజన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమారాణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.కిరణ్ మనేశ్వరి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిటెండెంట్, వైద్యులు వినయ్ కుమార్, సోషల్ ఫారెస్ట్ రేంజ్ అధికారి బి.గౌరీష్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రముఖ న్యాయవాది కాండ్రేగుల దేవిడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థులు, యువత తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిర్దేశించిన లక్ష్యాలను, చదువులను క్రమశిక్షణతో పూర్తి చేసి ఉత్తమ పౌరులుగా జీవించాలన్నారు. మాదక ద్రవ్యాలు (డ్రగ్స్) వాడకం, సరఫరా, ప్రోత్సహించడం చట్ట ప్రకారం నేరమని తెలిపారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్ వాడకంతో జీవితాలు చిన్నాభిన్నమవుతాయని తెలియజేసారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు అలవాటు పడిన వారికి వేర్వేరుగా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రభుత్వ వైద్యులు వినయ్ కుమార్ తెలిపారు. గంజాయి తోటలకు బదులు మన అమ్మ నాన్న పేరున మంచి ఆరోగ్యకరమైన మొక్కలు నాటాలని, వాటిని సోషల్ ఫారెస్ట్ ద్వారా ఉచితంగా అందజేస్తామని రేంజర్ గౌరేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లయిన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పసుమర్తి సాంబశివరావు, ముక్క రమేష్, మార్కెటింగ్ చైర్ పర్సన్ గనిరెడ్డి, పి.డి. జి.రాంబాబు, స్వచ్ఛంద సేవకులు వర్జుల వీర వెంకట రమణ మూర్తి (వాణి ప్రెస్ బాబు), వేపాడ సత్యనారాయణ, ఆర్క్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి డి.ప్రసాద్, ఉగ్గిన నాగబాబు, పందిరి శ్రీను, రుద్రరాజు సతీష్ వర్మ, కటకం దీపక్, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్థాపితం: 1952
విశాలాంధ్ర
తెలుగు జాతీయ దినపత్రిక
విలేకరులు కావలెను
అనకాపల్లి జిల్లాలో ఈ కింది కేంద్రాల్లో పని చేయుటకు కనీస విద్యార్హత ఇంటర్, ఆపైన చదివి జర్నలిజం పట్ల ఆసక్తి కలిగి తెలుగు భాషలో స్పష్టంగా రాయడం, చదవడం వచ్చి ఉండాలి.
తేది: 18-8-2024వ తేదీన ఉదయం 10 నుంచి 11 గంటల వరకు అనకాపల్లి విశాలాంధ్ర కార్యాలయంలో అర్హత రాత పరీక్ష నిర్వహించబడును. ఆసక్తి ఉన్న వారు 18వ తేదీ ఉదయం 9.30 గంటల్లోగా వాట్సాప్‌లో గాని నేరుగా గాని తమ పేర్లు నమోదు చేసుకోగలరు. అదేరోజు మధ్యాహ్నం 2 గం.ల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించబడును.
ఖాళీలు: అనకాపల్లి టౌన్, అనకాపల్లి కలెక్టరేట్, చోడవరం రూరల్, రోలుగుంట, బుచ్చయ్యపేట, నర్సీపట్నం రూరల్, నాతవరం, సబ్బవరం కేంద్రాల్లో పని చేయాలి.
సంప్రదించాల్సిన చిరునామా:
కొండలరావు, విశాలాంధ్ర బ్యూరో చీఫ్
విశాలాంధ్ర కార్యాలయం, దుర్గా లాడ్జి వీధి, నర్సింగరావుపేట,
రామచంద్ర థియేటర్ వెనుక, అనకాపల్లి.
సెల్: 9291900805, 9573385159.

విశాలాంధ్ర అనకాపల్లి
పేజి: 2
మంగళవారం 13, ఆగస్టు, 2024

స్మైల్ ద్వారా యాచకులకు జీవనోపాధి

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న "సపోర్టు ఫర్ మార్జినలైజ్డ్ ఇండివిజువల్స్ ఫర్ లైవ్లీహుడ్ అండ్ ఎంటర్‌ప్రైజ్ (స్మైల్)" పథకం ద్వారా అట్టడుగు వర్గాల వారైన యాచకులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి చూపాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. యాచక వృత్తిలో నిమగ్నమైన వ్యక్తుల సమగ్ర పునరావాసం కోసం అధికారులు కృషి చేయాలని సూచించారు. భిక్షాటనను నివారించడం అలాంటి వారిని గౌరవంగా, ఆత్మవిశ్వాసంతో సమాజంలోకి తిరిగి చేర్చడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. సోమవారం సాయంత్రం వివిధ విభాగాల అధికారులతో తన ఛాంబర్లో కలెక్టర్ సమావేశమయ్యారు. స్మైల్ పథకం తాలూక ప్రయోజనాలు, తద్వారా చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. నగర పరిధిలోని యాచకులను గుర్తించాలని, వారిని పునరావస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. వారిని ఆయా ప్రాంతాల్లోని సచివాలయాలకు అనుసంధానం చేయాలని సూచించారు. వారిలో మానసిక స్థైర్యాన్ని నింపి మార్పు తీసుకురావాలని, వారి స్వగ్రామాలకు పంపించాలని చెప్పారు. జిల్లాలో గుర్తింపు పొందిన స్వచ్ఛంద సంస్థ ద్వారా యాచకులకు మరిన్ని సేవలందించాలని సూచించారు. సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, సీపీవో శ్రీనివాసరావు, డిజేబుల్డ్ ఏడీ మాధవి, యూసీడీ పీడీ ఫణిరాం, డీఎం హెచ్వో జగదీశ్వరరావు, డీపీవో శ్రీనివాసరావు, ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - పరవాడ: ఎలాంటి ప్రాక్టికల్ ల్యాబ్స్ సౌకర్యం లేని ప్రైవేట్ ఐ.టీ.ఐ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు కె.అర్జున్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పరవాడలో పలు ఐటిఐ కళాశాలల ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో కొన్ని ప్రైవేటు ఐటిఐ కళాశాలల్లో విద్యార్థులకు సరైన విద్యాబోధన జరగడం లేదని, అలాగే ప్రాక్టికల్ ల్యాబ్ సౌకర్యాలు లేవని ఆరోపించారు. కనీస సౌకర్యాలు లేని ప్రైవేట్ కళాశాల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించేందుకు అనుమతులు ఇవ్వడం బాధాకరం అన్నారు. ఈ కళాశాలల నిర్లక్ష్యంపై గతంలో జిల్లా ఐటిఐ కన్వీనర్ కు వినతి పత్రం కూడా ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ పట్టించుకోకుండా ఎలాంటి మౌలిక సదుపాయాలు లేని కళాశాలలోనే ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించేందుకు అనుమతులు ఇచ్చారని ఆరోపించారు. కళాశాలల్లో విద్యా బోధన చేయకుండా మాస్ కాపీ చేయించి విద్యార్థుల జీవితాలతో ఆటలాడు కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించని ప్రైవేట్ ఐటిఐ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులందరినీ ఐక్యం చేసి పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ స్థానిక నాయకులు కృపానంద్ రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం బి. సి. బాలికల వసతి గృహంలో వసతుల లేమిపై బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ ఆరా

విశాలాంధ్ర - చోడవరం: చోడవరంలో బి.సి. బాలికల వసతి గృహంలో వసతులు కల్పించడంలో విఫలమైన సిబ్బంది, విద్యార్థినుల ఆందోళన పై రాష్ట్ర బాలికల హక్కుల పరిరక్షణ కమీషన్ ఎట్టకేలకు స్పందించింది. ఈ కేసును సుమోటాగా స్వీకరిస్తున్నట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం సోమవారం మీడియాకు తెలిపారు. చోడవరం శివారు అన్నవరం బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన విధంగా మెనూ ప్రకారం శుచి, శుభ్రతలతో భోజనం పెట్టకపోవడం, మౌలిక సదుపాయాల లేమిపై సోమవారం వివిధ దిన పత్రికల్లో ప్రచురితమైన వార్తలకు సీరియస్ గా తీసుకుని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సుమోటోగా స్వీకరిస్తున్నట్టు కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యవహారంలో హాస్టల్ సిబ్బంది విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్నారా,మరుగు దొడ్లు,ఇతర సదుపాయాలపైనా,బాలల హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతున్నారా తదితర అంశాలపై సమగ్రంగా విచారణ జరిపి సాంఘిక సంక్షేమ శాఖాధికారులు,జిల్లా ఉన్నతాధికారులు త్వరిత గతిన తమకు నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు,నివేదికలో పొందుపర్చిన అంశాల ఆధారంగా అధికారులు,సిబ్బందిపై చర్యలకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చట్టాన్ని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫారసులు చేయనున్నట్టు సీతారాం తెలిపారు.

పారిశుధ్యాన్ని మెరుగుపరచండి

జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ 8వ జోన్‌లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ జోనల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జోన్ 8లో బుచ్చి రాజుపాలెం, బాజీ జంక్షన్ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ పర్యటనలో కమిషనర్ పలు ప్రాంతాలలో పారిశుధ్య పనులను గమనిస్తూ, నిత్యం వీధులను, కాలనీలను శుభ్రం చేసేటప్పుడు వచ్చే వ్యర్థాలను తరలించేందుకు వాహనాలను సమయానుకూలంగా వెంటనే ఏర్పాటు చేసుకొని తరలించాలని, తద్వారా డస్ట్ బిన్ ఫ్రీ వార్డులుగా నగరాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు చేపట్టాలని, జోన్-8 పారిశుద్ధ్య పనులను మరింత మెరుగుపరుచుటకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన కాలువలో వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికునితో మాట్లాడుతూ రోజూ ఎన్ని గంటలు, ఏ ఏ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నావని ఆరా తీస్తూ, ఆరోగ్య పరిరక్షణకు చేతికి గ్లౌజులు వేసుకొని పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం ఫుట్ పాత్‌పై ఆక్రమిత వ్యాపారాలను గమనించి వెంటనే తొలగించాలని, పాదచారుల కోసం ఫుట్ పాత్ లను అందుబాటులో ఉంచాలని, సీజనల్ వ్యాధులైన డెంగ్యు, మలేరియా, అతిసార వ్యాధులు ప్రబలకుండా, దోమలు వృద్ధి చెందకుండా యాంటీ లార్వెల్ ఆపరేషన్స్, నిర్మూలన చర్యలు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిత్యం నివాసిత ప్రాంతాల్లో చేపట్టాలని జోనల్ కమిషనర్‌కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయ వైద్యాధికారి డాక్టర్ కృష్ణంరాజు, ఏపీడీ శ్రీరామ్, టీపీఓ తేజేశ్వరరావు, వార్డు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా

సభ్యులు రాకపోవడంతో నిర్ణయం
ఎంపీపీ జనసేనలోకి వెళ్లడమే కారణమా..?



విశాలాంధ్ర - మునగపాక: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశానికి హాజరై మండలంలో గల సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించవలసిన ప్రజా ప్రతినిధులు ఆ బాధ్యతలను మరచి తమ వ్యక్తిగత స్వార్థాల కోసం, అధికార పార్టీలు ఇచ్చే తాయిలాల కోసం పార్టీలు మారుతూ ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్నారు. ఆదివారం ఎంపీపీ, వైస్ ఎంపీపీ, సర్పంచులు వైసీపీని వీడి జనసేనలో చేరిన విషయం తెలిసిందే. అయితే ఆ ఎఫెక్ట్ సోమవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంపై తీవ్ర ప్రభావం చూపింది. ఎంపీపీ అధ్యక్షతన జరగవలసిన సమావేశానికి ఎంపీపీ పార్టీ మారునందున మొఖం చాటేసారు. వైసీపీకి చెందిన ఎంపీటీసీలు, సర్పంచులు తనను



ఎక్కడ నిలదీస్తారో అనే భయంతోనే ఎంపీపీ ఈ సమావేశానికి దుమ్మా కొట్టినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా అనూహ్యంగా జరిగిన ఈ జంపుల పట్ల కొంతమంది ప్రజా ప్రతినిధులు గందరగోళంలోకి వెళ్లిపోయారు. దీంతో వారు కూడా సమావేశానికి రాలేదు. అధికారుల హాజరు పూర్తి స్థయిలో ఉన్నప్పటికీ ఐదుగురు సభ్యులే కావడంతో సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీవో మన్మధరావు ప్రకటించారు. అభివృద్ధిపై చర్చించాల్సిన మండల సమావేశంలో రాజకీయ వలసల ప్రభావంతో వాయిదా పడడం విచారకరం.

అక్రమాలు ప్రోత్సహించిన అధికారులతో విచారణలా..?

తూతు మంత్రంగానే రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నారా...?
రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ సిసోడియాకి లేఖ
సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పి.ఎస్.అజయ్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఆగస్టు 15 నుండి రాష్ట్రంలో గ్రామ పంచాయతీ, మండల స్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టుగా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 10న ఉత్తర్వులు ఇచ్చిందని అదే రోజు ఈ సదస్సులను మంత్రులు లాంఛనంగా ప్రారంభిస్తారని, 16వ తేదీ నుండి 15 రోజులు పాటు ఈ సదస్సుల నిర్వహణ జరుగుతుందని అందులో పేర్కొన్నట్లుగా సిపిఐ (ఎం ఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పి.ఎస్.అజయ్ కుమార్ తెలిపారు. ఆ తదుపరి 40 రోజులపాటు సదస్సులో వచ్చిన సమస్యలను పరిష్కరిస్తారని పేర్కొన్నారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలతో పాటు గత ప్రభుత్వంలో జరిగిన లోటుపాట్లు, గత ప్రభుత్వంలో నిర్వహించిన రీ సర్వేలో జరిగిన అక్రమాలు, 22 ఏ జాబితాలో తొలగింపుకు సంబ ంధించిన ఫిర్యాదులు, బాధితులు రెవెన్యూ అధికారుల ముందు చెప్పుకోవచ్చు అని ఆ ఉత్తరంలో పేర్కొన్నారు. అయితే గతంలో వైయస్సార్సీపి అధికారంలో ఉన్నప్పుడు ఆయా మండలాలలో తహశీల్దారులుగా ఉండి చక్రం తిప్పిన వారు, రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్లుగా ఉండి అక్రమాలకు వంత పాడిన వారు, తమకు ఎన్ని ఫిర్యాదులు వచ్చినా ఆనాటి అధికార పార్టీ వారు తెచ్చిన రాజకీయ ఒత్తిడికి లొంగిపోయి కనీస విచారణ కూడా జరిపించని జాయింట్ కలెక్టర్లు కొన్ని జిల్లాలలో నేటికీ కొనసాగుతున్నారని అన్నారు. ఉదాహరణకు అనకాపల్లి జిల్లాలో చీడికాడ మండలం, కోణం రెవిన్యూ సర్వేనెంబర్ 289లో కోందు (పివిటిసి) ఆదివాసీలు గ్రామం కట్టుకొని స్థిర నివాసం, వుండి 30 ఏళ్ళుగా సాగులో వున్నా ఆ నిజాన్ని ప్రస్తావించకుండా చీడికాడ తహశీల్దార్, నర్సీపట్నం ఆర్డీఓలు కలెక్టర్‌కు తప్పుడు నివేదికలు పంపారని తెలిపారు. అందుకు ప్రధాన కారణం తప్పుడు రికార్డులతో అక్కడ భూములు కొనుగోలు చేసింది ఆనాటి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ముత్యాల నాయుడు అనుచరులు కావడమేనని అన్నారు. అదేవిధంగా గుంటి అనే కొండ దొర ఆదివాసీల గ్రామంలో 17 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉండగా 32 ఎకరాలు భూమి వున్నట్లు చూపించి గిరిజనేతరులకు డి ఫారం పట్టాలు ఇచ్చారని, అవి రద్దు కాకుండా అడ్డం పడ్డారని, దానికి కారణం పట్టాలు పొందిన వారు ఆనాటి అధికార పార్టీ నాయకులకు అనుచరులు కావడమే అని అన్నారు. వడ్డాది మాడుగుల మండలం కామకూటం రెవెన్యూ గ్రామంలో పెద్దేరు నిర్వాసితులకు ఇచ్చిన ప్రభుత్వ భూములు ఇతర జిల్లాల వారు చట్ట విరుద్ధంగా 99 సంవత్సరాలకు లీజ్ అగ్రిమెంట్లు రాయిం చుకొని అనుభవిస్తున్నారన్నారు. ఈ కుంభకోణంపై తహశీల్దార్‌కు, జాయింట్ కలెక్టర్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా కనీస ప్రాథమిక విచారణ కూడా జరపలేదన్నారు. అందుకు కారణం ఆ భూములు కొనుగోలు చేసిన వారు ఆనాటి అధికార పార్టీకి మద్దతుదారులు కావడమేనని, కామకూటం, శంకరం, తాటిపర్తి వంటి గ్రామాలలో డి బిఫారం పట్టా భూములు కొనుగోలు చేసిన వారికి జిరాయితీ హక్కులు కల్పించడం కోసం 22ఏ నుండి మినహాయించడానికి జాబితాలు కూడా తయారు చేశారని తెలిపారు. రోలుగుంట మండలంలోని పెద్దపేట గ్రామంలో డి ఫారం పట్టా భూములను స్థానికేతర్లకు ఇచ్చారని, కానీ సాగులో స్థానిక పెద్దపేట ఆదివాసీలు ఉన్నారని, ఎన్ని వినతి పత్రాలు ఇచ్చినా, స్థానికేతరుల వద్ద లక్షలాది రూపాయలు లంచాలుగా తీసుకొని, వాటిని స్థానికకేతరులే సాగు చేస్తున్నట్టుగా చూపించి రీ సర్వేలో సైతం వారి పేర్లనే పట్టాదారులుగా, సాగుదారులుగా నమోదు చేశారన్నారు. అదే మండలం చటర్జీపురం ఆదివాసీల పేర్లను సాగులెక్కల నుండి ఏకపక్షంగా తొలగించారని, అక్కడ 10 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నం చేసిన వైసిపి నాయకులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించారన్నారు. చీడికాడ మండలం కొండల కొత్తూరు ఆదివాసీలు నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ వద్ద గిరిజనతరులపై రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్ ఓ ఆర్) చట్టం కింద కేసు దాఖలు చేస్తే, గిరిజనుల న్యాయవాది వాయిదా తేదీ నాడు కోర్టుకు రాకపోయినా, న్యాయవాది కోర్టుకు వచ్చి వాదనలు వినిపించాడని చెబుతూ గిరిజనేతరులకు అనుకూలంగా రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ తీర్పు ఇచ్చారని, దానిపై న్యాయవాదులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి విచారణ జరగలేదన్నారు. 25 ఎకరాల భూమి ఒక తెల్ల రేషన్ కార్డు దళితుడికి ఉందని, 1బి రిజిస్టర్‌లో తప్పుడు ఎంట్రీ చేసి తదుపరి ఆ భూమిని వైసిపి భూమాఫియా కొనుగోలు చేయడానికి వీలుగా 1బి రికార్డులో మార్పులు చేసిన, చీడికాడ తహశీల్దార్‌కు 2022లో అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం షోకాజ్ నోటీసు ఇచ్చినా నేటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రభుత్వానికి చెందిన 30 లక్షల విలువైన 7 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ భూమిగా చూపించి, అది రిజిస్ట్రేషన్ కావడానికి సహకరించిన రెవెన్యూ అధికారుల పైన, రిజిస్ట్రేషన్ అధికారుల పైన ఇప్పటి వరకు ఆ రెండు శాఖలు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై ఆదివాసీలు అనేకసార్లు ఉన్నతాధికారులను కలిసి, తిరిగి తిరిగి అలసిపోయారు. అందుకు కారణం ఆనాటి వైసిపి భూమాఫియా తెరవెనకాతల ఉండడమేనని, ఈ అక్రమాలకు పాల్పడిన అధికారులందరూ ఎన్నికల సమయంలో వేరే జిల్లాలకు బదిలీపై వెళ్లి తిరిగి మళ్ళీ తమ స్థానాలకు చేరుకున్నారన్నారు. నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ అధికారిగా అదే వ్యక్తి కొనసాగుతున్నాడని, భూమి శిస్తు కమిషనర్ (సీసీఎల్ఏ) నుంచి విచారణ చేయమని ఆదేశాలు వచ్చినా, లోకాయుక్త నుండి విచారణ చేయమని ఆదేశాలు వచ్చినా జిల్లా రెవెన్యూ అధికారులు వాటిని ఖాతరు చేయలేదన్నారు. అనకాపల్లి జిల్లా వరకు పాత అధికారులే ఇప్పటికీ కొనసాగుతున్నారని, ఇతర జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలో అదే అధికారుల దగ్గరకు బాధితులు వెళ్లి ఫిర్యాదు చేసుకోవాలని చంద్ర బాబు నాయుడు ప్రభుత్వం చెప్పడంలో ఎలాంటి ఔచిత్యం లేదని, ఒకవేళ వారికి ఆధారాలు చూపించినా ఆ తప్పులన్నీ చేసింది సదరు అధికారులే కనుక తమకు వ్యతిరేకంగా తామే చర్యలు తీసుకుంటారని ప్రజలు ఆశించడానికి అవకాశం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వంకు నిజంగా చిత్తశుద్ధితో వుంటే పాత అధికారులను కనీసం బదిలీ చేయవలసి ఉంటుందన్నారు. అలా చేయలేదంటే రాష్ట్ర ప్రభుత్వం సమస్యను పరిష్కరించడం గాక, ప్రచార ఆర్భాటం కోసం చేస్తున్నట్టుగా ప్రజల భావించే అవకాశం ఉందన్నారు. గత ప్రభుత్వంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి జగనన్నకు చెప్పుకుందాం అని ఇలాంటి కార్యక్రమాలు పెట్టారని, ప్రజలు జగనన్నకు చెప్పుకున్నాం చెప్పుతో కొట్టుకున్నాం అని తమని తామే తిట్టుకుంటూ నిరాశ చెందారన్నారు. ఇప్పుడు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ రెవిన్యూ సదస్సులు పేరుతో అక్రమాలకు పాల్పడిన అధికారులతోనే విచారణ జరిపిస్తామని అంటే ప్రజలు, ముఖ్యంగా ఆదివాసీలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన అధికారులను రెవెన్యూ బాధ్యతల నుండి తప్పించాలని పి.ఎస్అజయ్ కుమార్ లేఖలో పేర్కొన్నారు.

గోకులం షెడ్లకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర - వి.మాడుగుల: జాతీయ ఉపాధి హామీ పథకం కింద మాడుగుల మండలంలో పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ళు కలిగి ఉన్న రైతులకు 25 గోకులం షెడ్ల మంజూరు కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మాడుగుల ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు డాక్టర్ వి.చిట్టి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో పశువుల షెడ్లకు 90 శాతం రాయితీ, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు 70 శాతం రాయితీ ప్రభుత్వం కల్పిస్తుందని, అర్హత కలిగిన పాడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

ర్యాగింగ్ రహితంగా ఏయూను నిలపాలి

విశాలాంధ్ర - విశాఖపట్నం: ర్యాగింగ్ రహితంగా ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని నిలపాలని ఏయూ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎన్.విజయ్ మోహన్ అన్నారు. సోమవారం ఉదయం ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ర్యాగింగ్ రహిత క్యాంపస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ర్యాగింగ్ వలన యువత జీవితం నాశనం అవుతుందన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడటం, ర్యాగింగ్‌ను ప్రోత్సహించడం సరికాదన్నారు. విద్యార్థుల మధ్య స్నేహభావం, సత్సంబంధాలు ఎంతో అవసరమన్నారు. ఏయూను ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా తీర్చిదిదద్దడం జరుగుతోందన్నారు. విద్యార్థులకు ఎటువంటి సమస్య ఎదురైనా వెంటనే విద్యార్థి వ్యవహారాల కార్యాలయానికి తెలియజేయాలన్నారు. నిరంతరం విద్యార్థులకు ఆచార్యులు, సిబ్బంది అవసరమైన సహకారాన్ని అందించడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా ర్యాగింగ్‌కు దూరంగా ఉంటామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆచార్య విజయ్ మోహన్ మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు బానిస కారాదని, ఆరోగ్యవంతమైన జీవనాన్ని కలిగి ఉండాలని సూచించారు. యువతరం విలువైన మానవ వనరులుగా, మేధో వనరులుగా నిలవాలన్నారు. విద్యార్థులతో మత్తుపదార్థాలకు దూరంగా ఉంటామంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆచార్య పాల్ డగ్లస్, ఆచార్య ఎన్.ఎం యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

నాటు తుపాకీతో వేటాడుతున్న వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: కొండెంపూడి గ్రామ శివారు మెట్ట వద్ద లైసెన్స్ లేకుండా నాటు తుపాకీ పట్టుకొని వేటకు వెళుతున్న కోమల్లపూడి గ్రామానికి చెందిన దాసరి సత్యారావు అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై ఈశ్వరరావు తెలిపారు. దాసరి సత్యారావు విజయనగరం జిల్లా ఎల్.కోట మండలం గొల్జాం గ్రామానికి చెందిన మునినన సత్యనారాయణ అనే వ్యక్తి వద్ద 8000/- రూపాయలకు కొన్నట్లు చెప్పడంతో అతడ్ని కూడా ఆ గ్రామానికి వెళ్లి విచారించినట్టు తెలిపారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం అనకాపల్లి కోర్టుకి తరలించినట్టు తెలిపారు.

జీవో 117ను రద్దు చేయాలి

విశాలాంధ్ర - ఆనందపురం: జి .వో నెంబర్ 117ను రద్దు చేసి, జి వో నెంబర్ 53 ప్రకారం సర్దుబాటు చేపట్టాలని ఫ్యాప్టో కమిటీ పిలుపుమేరకు సోమవారం మండలంలో ఉన్న అన్ని ఎంఆర్సి కేంద్రాల్లో ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఫ్యాప్టో నాయకులు ఆనందపురం ఎంఆర్సి కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తూ పలు డిమాండ్లతో కూడిన మెమొరాండంను మండల విద్యాశాఖాధికారి కె.గంగరాజుకు అందజేసారు. ఈ కార్యమంలో ఫ్యాప్టో నాయకులు టి.ఆర్. అంబేద్కర్, ఉప్పాడ రాము, గురుగుబిల్లి గంగాధర్, రమేష్ తదితరలు పాల్గొన్నారు.

లంకెలపాలెం ఇసుక డిపో తనిఖీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: లంకెలపాలెం ఇసుక డిపోను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సోమవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమల్లోకి తీసుకొచ్చిన నేపథ్యంలో డిపోలో ఇసుక నిల్వలు, విక్రయాలు, రవాణా స్థితిగతులను ఆయన పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ప్రక్రియను అత్యంత పారదర్శంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుత ఇసుక నిల్వలు, ఇప్పటి వరకు ఎంత విక్రయం జరిగింది అనే వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో అక్కడ ఇసుక కోసం వచ్చిన పలువురితో కలెక్టర్ మాట్లాడారు. ఇసుక రవాణా, ధరలు, విక్రయ ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బంది సహకారం గురించి ఆరా తీశారు. ఆయన వెంట స్థానిక రెవెన్యూ అధికారులు, మైన్స్ విభాగం అధికారులు, సిబ్బంది ఉన్నారు.